

వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి


మృతి చెందిన శిశువుతో తల్లి

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లిలో డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా సోమవారం శిశువు మృతి చెందిన సంఘటన స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఓ ప్రయివేటు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు బి.కొత్తకోట మండలం, ఆలేటిపల్లికి చెందిన రఘునాథ్ భార్య అంజలి గర్భందాల్చిన రోజు నుంచి చికిత్స తీసుకుంటోంది. ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ఉన్నా కూడా అదనంగా డబ్బులు తీసుకుని డెలివరీ సరిగా చేయకపోవడంతో శిశువు చనిపోయిందని ఆరోపించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసిన తర్వాత శిశువు చనిపోవడంతో కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకుని బాధ్యతలకు న్యాయం చేయాలని టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు విచారిస్తున్నారు.

ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు వెంటనే ప్రారంభించాలి

- ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని అన్ని సచివాలయాల్లో జగనన్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లను వెంటనే ప్రారంభించాలని ఇందుకు తగిన కార్యాచరణ చేపట్టాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' స్థలాల రిజిస్ట్రేషన్ అంశంపై విజయవాడ నుంచి రాష్ట్ర భూ పరిపాలన శాఖ కమిషనర్ జి.సాయిప్రసాద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్ నుంచి ఇన్‌ఛార్జి కలెక్టర్, డిఆర్ఒ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర భూ పరిపాలన శాఖ కమిషనర్ మాట్లాడుతూ ఫిబ్రవరి రెండో వారంలో ముఖ్యమంత్రిచే లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల పత్రాల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. రీ సర్వే పూర్తయి, ఎల్‌పిఎం (ల్యాండ్ పార్సిల్ నంబర్) వచ్చిన గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చిందన్నారు. భూ పరిపాలన శాఖ నుంచి నేడే రిజిస్ట్రేషన్ శాఖకు జగనన్న లేఔట్ లో స్థలాలు పొందిన అర్హులైన లబ్ధిదారుల డేటా పంపుతారని తెలిపారు. ఆ డేటా వివరాలను గ్రామ వార్డు సచివాలయాలకు రిజిస్ట్రేషన్ శాఖ వెంటనే పంపించాలని ఆదేశించారు. ఆయా గ్రామాల ప్రజలు ఇకపై ఆస్తుల రిజిస్ట్రేషన్లను తమ సచివాలయాల్లోనే సులభంగా చేసుకోనే వెసులుబాటు కలుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ల అంశాన్ని కలెక్టర్లు ప్రాధాన్యతగా తీసుకొని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. విసి అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 68 వేల మంది లబ్ధిదారులున్నారని, వీరందరికీ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని చెప్పారు. ఈ నెల 30న మంగళవారం ప్రతి సచివాలయంలో కనీసం ఒక్క టెస్ట్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ఫిబ్రవరి 9 లోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇందుకుగాను ఏ లేఔట్ లో ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు, వారి ప్లాట్ నెంబర్ వివరాలు, లేఅవుట్, సర్వే నంబర్లను కచ్చితమైన మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. పొరపాటులకు ఎక్కడ తావు ఇవ్వరాదన్నారు. జగనన్న లేఔట్‌లో ఇంటి స్థలం పట్టా పొందిన లబ్ధిదారులను పంచాయతీ కార్యదర్శి, విఆర్‌ఒలు రేపటి నుంచి ఆయా సచివాలయాలకు మొబిలైజ్ చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్ఒ సత్యనారాయణ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక ఇన్ఫాంట్ జీసస్ హైస్కూల్లో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు రెండవ రోజు రసవత్తరంగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన పోటీలకు సంభందించి వివరాలిలా ఉన్నాయి. ఉదయం విద్యా భారతి, బీహార్ మధ్య పోటీలు ప్రారంభమయ్యాయి. బీహార్ జట్టు నాలుగు పాయింట్ల తేడాతో విజయం సాధించింది. అనంతరం పంజాబ్, వెస్ట్ బెంగాల్ మధ్య జరిగిన పోటీల్లో పంజాబ్ జట్టు ఐదు పాయింట్ల తేడాతో విజయం సాధించింది. జమ్ము, తమిళనాడు జట్లమధ్య జరిగిన పోటీల్లో తమిళనాడు జట్టు 63 పాయింట్లు తేడాతో గెలిచింది. కోర్టు నెంబర్ ఒకటిలో జరిగిన కేరళ, ఛండీగఢ్ పోటీలలో 34 పాయింట్ల తేడాతో కేరళ జట్టు విజయం సాధించింది. కర్ణాటక, హర్యానాల మధ్య జరిగిన పోటీలో 66 పాయింట్లు తేడాతో హర్యానా విజయం సాధించింది. విద్యా భారతి, కెవిఎస్‌ల మధ్య జరిగిన పోటీలో 11 పాయింట్లు తేడాతో విద్యా భారతి జట్టు విజయం సాధించింది. ఉత్తర ప్రదేశ్, ఎన్‌విఎస్ జట్ల మధ్య జరిగిన పోటీలో ఐదు పాయింట్లు తేడాతో ఉత్తర ప్రదేశ్ విజయం సాధించగా ఢిల్లీ, గుజరాత్‌ల మధ్య జరిగిన పోటీలో నాలుగు పాయింట్లు తేడాతో ఢిల్లీ విజయం సాధించింది. ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ మధ్య జరిగిన పోటీలో 34 పాయింట్లు తేడాతో ఛత్తీస్‌గఢ్ విజయం సాధించగా సిఐఎస్‌సి, ఆంధ్రప్రదేశ్లో జట్లు మధ్య జరిగిన పోటీలో ఆంధ్రప్రదేశ్ తొమ్మిది పాయింట్లు తేడాతో విజయం సాధించింది.


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

'ఉక్కు' శంకుస్థాపనలకే పరిమితం

- జగన్ మారారు..చేసిన మేలు మరిచారు
- వైసిపి కోసం నిస్వార్థంగా పనిచేశా
- ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పిసిసి అధ్యక్షులు షర్మిల


ఇడుపులపాయలోని వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న షర్మిల, సునీత

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప/వేంపల్లె/ఖాజీపేట

కడప ఉక్కు పరిశ్రమను శంకుస్థాపనలకే పరిమితం చేశారని పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల విమర్శించారు. సోమవారం కడప నగర శివారులోని జయరాజ్ గార్డెన్‌లో పిసిసి మీడియ చైర్మన్ తులసిరెడ్డి అధ్యక్షతన కడప, అన్నమయ్య జిల్లాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ తన తండ్రి వైఎస్సార్ బ్రతికి ఉంటే కడప జిల్లాకు కడప పరిశ్రమ వచ్చేదన్నారు. ఈ పరిశ్రమ వల్ల 20 వేల ఉద్యోగాలు వచ్చేవి, లక్ష మందికి పరోక్షంగా ఉపాధి దొరికేదని తెలిపారు ఉక్కు పరిశ్రమ ఒక కలగానే మిగిలిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కడప స్టీల్ ప్రాజెక్ట్‌ను విభజన హామీల్లో పెట్టింది, చంద్రబాబు రూ.18 వేల కోట్లతో మళ్ళీ శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. బాబు 5 ఏళ్లలో కడప స్టీల్ పై నిర్లక్ష్యం వహించారని ధ్వజ మెత్తారు. ప్రతిపక్ష నేతగా జగన్ దీక్షలు కూడా చేశారని ముఖ్యమంత్రి అయ్యాక జగన్ రెండు సార్లు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కడప స్టీల్‌ను శంకుస్థాపన ప్రాజెక్ట్‌గా మార్చారని విమర్శించారు. నాన్న రాజశేఖర్‌రెడ్డి రక్తమే నా ఒంట్లో ప్రవహిస్తుందన్నారు. పులి కడుపున పులే పుడుతుందన్నారు. మార్క్ రాజకీయాలకు వైయస్సార్ కేరాఫ్ అడ్రస్ అని పేర్కొన్నారు. కడప నా పుట్టినిల్లు, జగన్ లాగే నేను ఇక్కడే పుట్టానని తెలిపారు. జగన్ అప్పటి మనిషి కాదన్నారు. ఇప్పటి జగన్‌ను ఎప్పుడూ చూడలేదన్నారు. వైసిపి కోసం నిస్వార్థంగా పనిచే శానని తెలిపారు. కార్యక్రమంలో సిడబ్ల్యూసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కొప్పుల రాజు, పల్లంరాజు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, మాజీ కేంద్ర మంత్రి జెడి. శీలం, కడప జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు అల్లా బకాష్, కాంగ్రెస్ పార్టీ కడప నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, బండి జకరయ్య, ప్రభాకర్, గొల్లు కృష్ణారావు, మాజీ మంత్రి అహ్మ దుల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, రాజేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, రాష్ట్ర మహిళా అధ్యక్షులు తాంతియా కుమారి పాల్గొన్నారు.


మాజీ మంత్రి డి.ఎల్.రవీంద్రారెడ్డితో మాట్లాడుతున్న షర్మిల

ఇడుపులపాయలో షర్మిలతో సునీత భేటీ

వైఎస్ఆర్ జిల్లా వేంపల్లె మండలంలోని ఇడుపులపాయలో బస చేసిన పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిలతో మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ వైఎస్.సునీత భేటి ఆయ్యారు. సోమవారం ఉదయం సునీత హైదరాబాద్ నుంచి నేరుగా ఇడుపులపాయకు చేరుకొని తన సోదరి షర్మిలతో భేటీ అయ్యారు. వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్ఆర్ సమాధి వద్దకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డితో కలిసి షర్మిల, సునీత వెళ్లి వైఎస్ఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. షర్మిలతో సునీత రెండు పాటు గెస్ట్‌హౌస్‌లో భేటి అయ్యారు. వారివురు భేటి కావడంతో సునీత కాంగ్రెస్‌లో చేరుతారనే వాటిపై రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయ భేటీలో కీలకమైన అంశాలు మాట్లాడినట్లు తెలిసింది. ముందు నుంచి వివేకా హత్యలో పోరాడుతున్న సునీతకు షర్మిల మద్దతు పలుకుతూనే ఉంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల, కడప నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి బలమైన వ్యక్తిని నిలబెట్టేందుకు కాంగ్రెస్ అధిష్టానం చూస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో షర్మిలను వివేకా కుమార్తె సునీత కలవడం చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్ కుటుంబానికి దూరంగా ఉన్న సునీత ఇప్పుడు షర్మిలని కలవడం రసవత్తర రాజకీయానికి తెరలేపి నట్లయింది. వైఎస్ఆర్‌కు నివాళులర్పించిన అనంతరం షర్మిల కాంగ్రెసు పార్టీ విస్తత సమావేశానికి కడపకు వెళ్లాగా, సునీత పులివెందులకు వెళ్లారు. **మాజీ మంత్రి డిఎల్‌ను కలిసిన షర్మిల..** ఖాజీపేటలో మాజీ మంత్రి డాక్టర్ డి.ఎల్ రవీంద్రారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా చేపట్టనున్న చర్యల్లో భాగంగా డియల్ రవీంద్రారెడ్డిను కలిశానని చెప్పారు. రానున్న ఎన్నికలకు సమాయత్తం కావాలని, పార్టీని బల పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు మద్దతు కోరెందుకు తాను వచ్చానని చెప్పారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. **షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన విజయజ్యోతి** బద్వేలు నియోజ కవర్గానికి చెందిన విజయ జ్యోతి సోమవారం జయరాజ్ గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. విజయజ్యోతికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ జ్యోతి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.


గర్భిణులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

గర్భిణుల సంరక్షణ బాధ్యత కుటుంబ సభ్యులదే

ప్రజాశక్తి-పీలేరు

గర్భిణుల సంరక్షణ బాధ్యత కుటుంబ సభ్యులదేనని, వారికి చేసే శారీరక పరీక్షలు, వారికి పుట్టబోయే శిశువు మెరుగైన ఆరోగ్యం కోసమని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. సోమవారం పీలేరు మాడల్ కాలనీలో ఆయన తమ ఆరోగ్య సిబ్బందితో కలిసి హైరిస్క్ గర్భిణుకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మహిళ గర్భందాల్చిన తొమ్మిది మాసాలూ వారి ప్రభావం బిడ్డపై ఉంటుందని, మందులు, మాత్రలు తినడంతో విసుగు, ఆందోళన, కోపం వంటి పరిస్థితులకు దూరంగా ఉండి, మానసిక ప్రశాంతత అలవర్చుకోవాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. 8 గంటల నిద్ర, పగటిపూట 2 గంటల విశ్రాంతి, ఉదయం తేలికపాటి నడక, నిర్దేశించిన సమయానికి డాక్టర్‌తో ఆరోగ్య పరీక్షలు, సురక్షిత మాతృత్వానికి, తల్లీబిడ్డ సంక్షేమానికి ఎంతో దోహదం చేస్తుందని గర్భిణులకు తెలియజేశారు. ఐరన్ ఫోలిక్, అల్బెండజోల్ 400 యంజి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఎఎన్ఎం లక్ష్మీ, సిహెచ్‌ఒలు సౌజన్య, వెంకటరత్నం, సుధ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు అంగళ్లులోని విశ్వం డిగ్రీ, పీజీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని, నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాలలో హెటేరో డ్రగ్స్ కియా మోటార్స్, ముతూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, గ్లోబివా లాంటి 20 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఈ జాబ్ మేళాలో హాజరు అయ్యే నిరుద్యోగ యువతీ,యువకులు విద్యార్హతలు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, నర్సింగ్ , ఏదైన డిగ్రీ, బిటెక్, పీజీ చదివిన వారు అర్హులన్నారు. 18 ఏళ్ల నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన హాజరు కావాలన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నెలకి రూ.10 వేల నుంచి రూ. 30 వేల వరకు జీతం ఉంటుందని తెలియజేశారు. కచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్‌కార్డ్, రెండు ఫొటోలతో అర్హత కలిగిన నిరుద్యోగ యువతి,యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7799587687, 8897776368, 9741432931 లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గోరాన్ చెరువుకు చెందిన టిడిపి కార్యకర్త రామాంజులు పీలేరులో నిర్వహించిన రా.కదిలిరా.. సభకు వెళ్లి తిరు పయనంలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆదివారం సాయంత్రం అతని మృతదేహానికి టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు నివాళు లర్పించారు. అనంతరం మృతుని కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రామంజులు రోడ్డు ప్రమాదంలో మరణించడం చాలా బాధాకరమైన విషయం అని అన్నారు. అతని కుటుంబాన్ని అని విధాల అండగా ఉంటామని తెలిపారు. అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి, రామంజులు కుటుంబానికి పార్టీ నుంచి మరికొంత ఆర్థిక సాయం అందించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రభాకర్ నాయుడు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రాజు, మాజీ ఎంపిటిసి రెడ్డి ప్రసాద్ రెడ్డి, బండెన్న, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

- జిల్లా ఇంటర్ విద్యా అధికారి కృష్ణయ్య


మాట్లాడుతున్న ఆర్ఐఒ కృష్ణయ్య

ప్రజాశక్తి -రాయచోటి

అన్నమయ్య ఫిబ్రవరిలో జిల్లాలో నిర్వహించే ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అన్నమయ్య జిల్లా ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, సోషియల్ వెల్ఫేర్, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, ప్రయివేట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు పర్యావరణ విద్య, నైతిక, మానవ విలువలు సబ్జెక్ట్ విధిగా రాయాల్సి ఉంటుందని చెప్పారు. 2న నైతిక, మానవ విలువలు పరీక్ష, 3న పర్యావరణ విద్య అంశం పై పరీక్ష ఉంటుందని చెప్పారు. ప్రశ్నపత్రం ఇంటర్మీడియెట్ బోర్డు జ్ఞానభుమి లాగిన్ లో ఉంటుందని పేర్కొన్నారు. మూల్యాంకనం సమీప కళాశాల అధ్యాపకులచే నిర్వహించాలన్నారు. పరీక్ష అనంతరం అదే రోజు విద్యార్థుల మార్కులను ఆన్లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆన్సర్ పేపర్లు జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ రెండు పరీక్షలలో విద్యార్థులు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలన్నారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు ప్రకాష్, అమరేంద్ర కుమార్, నాగ సురేష్, స్పెషల్ ఆఫీసర్ బాల కృష్ణ, మూర్తి పాల్గొన్నారు.

ఎర్రచందనం దొంగలు వైసిపి అభ్యర్థులా? : 'చమర్తి'


సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి అహంకారానికి, అరాచక పాలన, దురాగాతాలకు స్వస్తి పలికి ప్రజాకోర్టులో శిక్షపడే సమయం ఆసన్నమైందని, జగన్‌కు ఇక మిగిలింది 74 రోజులు మాత్రమేనని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు జగన్ మోహన్‌రాజు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు జరిగినా జగన్ పరిపాలనకు స్వస్తి పలకడానికి యువత, రైతులు, ప్రజలు, ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగస్తులంతా ముక్తకంఠంతో సిద్ధంగా ఉన్నారని, వైసిపికి కౌంట్ డౌన్ మొదలైందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీలు అంటూ ప్రగల్భాలు పలికిన జగన్, నేడు దళిత అభ్యర్థులను మాత్రమే మార్చడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. పెద్దిరెడ్డి అరాచక విధానాలపై సత్యవేడు నియోజకవర్గ దళిత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వ్యాఖ్యలపై సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎర్రచందనంతో జగన్‌కు సంబంధాలు నిజం కాదా? జగన్ ఆత్మీయుడైన ఎర్రచందనం స్మగ్లర్ విజయానందరెడ్డికి వైసిపి టికెట్ కేటాయించడమే ఇందుకు నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. వైసిపి అసమర్థ పరిపాలన వల్లే రాష్ట్రంలో అప్పులు పెరిగి వాటికి వడ్డీలు భారీగా పెరగడంతో అధిక భారం ప్రజలపైన పడుతుందని తెలిపారు. ఒకప్పుడు రూ.200 ఉన్న కరెంటు బిల్లులు ఇప్పుడు ఐదు రెట్లు పెరిగి రూ.వెయ్యికి చేరిందని విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వంలో లేని అప్పులు, కష్టాలు ఇప్పుడు ఎందుకు వచ్చాయో ప్రజలే ఆలోచించుకోవాలని., మద్యం, నిత్యవసర ధరలు, ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచుతూ ఈ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ఒక ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. టిడిపి అధికారంలో ఉంటే సాగునీటి ప్రాజెక్టులన్ని పూర్తి చేసేవారని తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్ రాజు, తులసి నాగేంద్ర పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు'

ప్రజాశక్తి- రాయచోటి

జగనన్న చెబుదాం కార్యక్రమంలో అందిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదని ఎప్పటికప్పుడూ నాణ్యతగా వాటిని పరిష్కరించాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిఆర్ఒ సత్యనారాయణ, ఎస్‌డిసి శ్రీలేఖతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టరు మాట్లాడుతూ పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీదారులు సంతృప్తిచెందేలా నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ, రీ ఓపెనింగ్ కాకుండా సంతృప్తి స్థాయిలో అర్జీలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ అరవింద

'మిట్స్'లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్ అండ్ ఇట్స్ రెవల్యూషనరీ అప్లికేషన్ అను అంశంపై అనంతపురం జెఎన్‌టియు, మిట్స్ కళాశాల సంయుక్తంగా జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ముఖ్య అతిథి తిరుపతి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరవింద మాట్లాడుతూ కొత్త సూపర్ ఫాస్ట్ క్వాంటమ్ ప్రాసెసర్‌ను డెవలప్ చేసింది ప్రముఖ ఐబిఎం కంపెనీ అని, వరల్డ్‌లో ఏ ప్రాసెసర్‌తో పోల్చుకున్నా ఇది అతిపెద్ద క్విట్ కౌంట్ కలిగి ఉందన్నారు. క్వాంటమ్ బిట్స్ అని, ప్రతి కంప్యూటర్ జీరో, ఒకటిపై ఆధారపడి పనిచేస్తాయని తెలిపారు. క్వాంటమ్ బిట్స్ అంటే క్లాసిక్ కంప్యూటింగ్‌లో టాస్కుల నిర్వహణకు ప్రాసెసర్లు ఒకటి, జీరో(బిట్స్)పై ఆధారపడి ఉంటాయన్నారు. క్వాంటమ్ కంప్యూటిరింగ్‌లో క్విట్స్ ఒకే సమయంలో ఒకటి, జీరోతో పాటు ఒకటిని సూచిస్తాయని పేర్కొన్నారు. క్లాసికల్ కంప్యూటర్స్‌తో పోల్చినప్పుడు క్వాంటమ్ కంప్యూటర్లు సూపర్ ఫాస్ట్ ప్రాసెసర్స్ ఉపయోగించి ఎక్కువ డేటాను ప్రాసెస్ చేయగలవు అని, ఒక వస్తువు స్థితిని కొలవడానికి ముందే దాని సంభావ్యత ఆధారంగా గణనలను నిర్వహించగలవని పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్‌గా పాండిచేరి యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సుబ్రమణియన్ మాట్లాడుతూ ఐబిఎం కంపెనీ వారి సమాచారం ప్రకారం కాగా 2025 నాటికి 4,000 క్విట్‌ల లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. 2024 నాటికి ఐబిఎం నుంచి రెండో క్వాంటమ్ సిస్టమ్ విడుదలవుతుందని చెప్పారు. క్వాంటమ్ కంప్యూటింగ్ అభివృద్ధికి గాను కేంద్ర ప్రభుత్వం రూ.6000 కోట్లు కేటాయించిందన్నారు. ఐదు రోజుల పాటు అధ్యాపకులు క్వాంటమ్ కంప్యూటింగ్‌పై అవగాహన కలిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, కో-ఆర్డినేటర్ డాక్టర్ దినేష్ పాల్గొన్నారు.

అదృశ్యమైన తల్లీ, పిల్లల ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన భార్గవి తన ముగ్గురు పిల్లలతో ఈ నెల 23న అత్తారింటి నుంచి కొన్ని సమస్యలతో అదృశ్యమైన విషయం తెలిసిందే. సోమవారం పోలీసులు వారిని బంధువులకు అప్పగించారు. బంధువులతో మనస్పర్థలతో ఇంటి నుంచి వెళ్లిపోయారని తెలిపారు. ఈ పద్ధతి కాదని ఎస్ఐ రమేష్ బాబు భార్గవిని మందలించారు. ఆమె తల్లి కృష్ణవేణి కూతురు సమాచారం తెలిసి కూడా తెలియజేయలేదన్నారు. అత్తగారింటి వారిపై కేసు పెట్టడం పద్ధతి కాదని ఆమెను పోలీసులు హెచ్చరించారు.


కుటుంబ సభ్యులకు అప్పగించిన భార్గవి, పిల్లలు


ఇసుక తవ్విన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి

ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల విచారణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో ఇసుక అక్రమ రవాణాపై స్థానిక పోలీసులు విచారణ మొదలుపెట్టినట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. తవళం గ్రామ చౌకిలవారిపల్లెకు చెందిన టి.జగదీశ్వర్‌రెడ్డి గృహ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకుండా నిమ్మనపల్లి పంచాయతీ బోడిబండలోని కట్టువ కాలువలో జెసిబి సాయంతో ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించి చౌకిలవారిపల్లెలో నిల్వ ఉంచారన్నారు. జగదీశ్వర్‌రెడ్డి కట్టువ కాలువలో నుంచి ఇసుకను తరలించే క్రమంలో నిమ్మనపల్లి మండలం, శివానగర్‌కు చెందిన పెద్దిరెడ్డి సురేంద్రరెడ్డికి సంబంధించిన భూమికి ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ నీటి పైపు లైన్లను ధ్వంసం చేశారని, దీనితో తన వ్యవసాయ పంటలకు నీరు అందించడానికి ఇబ్బంది ఏర్పడినట్లుగా బాధితుడు తెలిపారు. తన నీటి పైప్ లైన్‌ను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేయాలని సురేంద్రరెడ్డి ఫిర్యాదు చేయగా, ఎస్ఐ తిప్పేస్వామి, హెడ్ కానిస్టేబుల్ శివ రామకృష్ణ బాధితుడు సురేంద్రరెడ్డితో కలిసి ఇసుకను తరలించిన స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం స్థానిక డిప్యూటీ తహశీల్దార్ తపస్వినికి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించి నిల్వ ఉంచిన ఇసుకను స్వాధీనం చేసుకోవాలని బాధితుడు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించి, నిల్వ ఉంచిన ఇసుకను స్వాధీనం చేసుకోవడానికి చర్యలు చేపడతామని తెలిపారు. బాధితుడు సురేంద్రరెడ్డి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

నేడు చేపల చెరువులకు బహిరంగ వేలం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2024-25 సంవత్సరం చేపల ఫలసాయానికి మంగళవారం సామకోటవారిపల్లి పంచాయతీలోని చెరువులకు బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎ.వెంకట రమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సామకోటవారిపల్లి పంచాయతీలోని చెరువులు ఇటీవల పడిన వర్షాలకు నిండడంతో సంవత్సరం (2024-25) పాటు చేపల ఫలసాయానికి వేలం పాటను సామకోటవారిపల్లి సచివాలయం వద్ద ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేలం పాటలో ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు పాల్గొంటారన్నారు. ఆశక్తి కలిగిన వారు ముందుగా రూ.3000 డిపాజిట్ రుసుం కట్టి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. డిపాజిట్ దారులు గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదని పేర్కొన్నారు.



మగ్గం కిట్లను అందజేస్తున్న పార్థసారథి, శివసాయి

ఉచితంగా మగ్గం పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ స్కిల్ హబ్ గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన వీధిలోని ట్రైనింగ్ సెంటర్‌లో మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ పొందుతున్న మహిళలకు సర్టిఫికెట్ జ్ఞాపకార్థం గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారథి మగ్గం వర్క్ ట్రైనింగ్ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఉప సర్పంచ్ తోట శివసాయి మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ల ద్వారా మహిళలకు ఉపాధిని అందించే కోర్సులు నేర్పుకోవడం మంచి ప్రయత్నమన్నారు. పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యుల సహకారంతో ఎపిఎండిసి ఫండ్స్ ద్వారా 180 మంది మహిళలకు కుట్టు మెషిన్ లు ఉచితంగా పంపిణీ చేశారని ఆటువంటి అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. జడ్‌పిటిసి పాలెంకోట రత్నమ్మ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి కుటుంబానికి సాయంగా ఉండాలన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు చేస్తూ మహిళలకు సాయం అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారథిని అభినందించారు. అనంతరం శిక్షణ పొందుతున్న 30 మందికి కిట్స్ అందజేశారు. అతిథులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ పూల తనూజ, ట్రైనర్ పాలెంకోట పద్మావతి, పవిత్ర, భావని మహిళలు పాల్గొన్నారు.


విద్యార్థులకు వ్యాధుల గురించి వివరిస్తున్న డాక్టర్ కార్తీక్

విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-నందలూరు

విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి, పౌష్టికాహార ఆవశ్యకత గురించి తెలుసుకోవాలని ప్రభుత్వ వైద్యులు కార్తీక్ విశ్వనాథ్ పేర్కొన్నారు. ఐదవ రోజు ప్రత్యేక శిబిరంలో భాగంగా జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యకర్తలకు కాలానుగుణంగా వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు గూర్చి అవగాహనా సదస్సు ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ టైఫాయిడ్, జలుబు, జ్వరం, కామెర్లు మొదలగు వ్యాధులు నివారణ చర్యలు గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అనిమియా, అధ్యాపకులు సురేష్, సమత, వసంత్, శైలజ, ఆదిలక్ష్మి, కేశవులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి రక్తదానం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంపల్లి వాసి కృష్ణారెడ్డి కడప హిమాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమయంలో అధిక రక్తస్రావం జరగడంతో చాలా అరుదుగా లభించే ఎబి నెగిటివ్ రక్తం అవసరమైనందున దాతల కోసం చాలా ప్రయత్నాలు చేశారు. రక్తం అవసరం విషయం తెలుసుకున్న అంగళ్ళుకు చెందిన ఫరీద్ అనే యువకుడు అంగళ్ళు నుండి కడపకు వెళ్లి రక్తం ఇచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు ఫరీద్ చేసిన మంచి పనిని అందరూ కొనియాడారు.


రక్తదానం చేస్తున్న ఫరీద్

బద్వేల్ వైసిపిలో భగ్గుమన్న విభేదాలు

- అభ్యర్థి ఎంపిక విషయంలో తకరారు
- ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డికి వ్యతిరేకంగా అసమ్మతి నాయకుల సమావేశం
- ఎమ్మెల్యే సుధాకు టికెట్ కేటాయిస్తే సహకరించం
- సమావేశంలో పోరుమామిళ్ల వైసిపి మండల నాయకులు విశ్వనాథరెడ్డి


అనుచర వర్గంతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి -పోరుమామిళ్ల

మరో రెండు నెలల్లో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సిఎం సొంత జిల్లాలో వైసిపిలో అసమ్మతి సెగ తగలుతోంది. ఇందుకు బద్వేల్ నియోజకవర్గంలో వైసిపిలో విభేదాలు తారాస్థాయికి చేరడమే. అభ్యర్థి ఎంపిక విషయంలో రెండు గ్రూపుల మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొంది. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకు టికెట్ ఇవ్వొద్దంటూ ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి వ్యతిరేక గ్రూపు నాయకులు అధిష్టానం వద్ద పట్టుబట్టింది. ఇందులో భాగంగా సోమవారం పోరుమామిళ్లలో వైసిపి వ్యతిరేక గ్రూపు నాయకులు సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే సుధాకు టికెట్ ఇస్తే సహకరించబోమని తెగేసి చెప్పారు. నిన్నటి వరకు అంతర్గతంగా ఉన్న విభేదాలు ప్రస్తుతం బహిర్గతమయ్యాయి.

ఎమ్మెల్యే సుధాకు టికెట్ కేటాయిస్తే సహకరించబోం..

బద్వేల్ నియోజకవర్గం వైఎస్ఆర్‌సిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధాకు కేటాయిస్తే ఎటువంటి పరిస్థితుల్లో సహకరించబోమని వైఎస్ఆర్‌సిపి మండల నాయకులు విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. బద్వేల్ నియోజకవర్గం వైఎస్ఆర్ సిపి అసమ్మతి నేతల సమావేశం వైఎస్ఆర్ సిపి మండల నాయకులు విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో కాలువ కట్ట సమీపంలోని ఆయన ఎస్టేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గ వైసిపికి నాయకత్వం వహిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి అనుచరులు వ్యవహరిస్తున్న తీరుకు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు విసిగిపోయారన్నారు. పూర్తిగా ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తూ ఉన్నప్పటికీ పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తాము ఎంతో ఓపిక పట్టామన్నారు. 14 ఏళ్ల నుంచి ఎమ్మెల్సీ గోవిందరెడ్డి నిర్వాహకంతో తాము రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా చెప్పలేనంత ఇబ్బందులు పడ్డామని చెప్పారు. డాక్టర్ సుధా ఎమ్మెల్యే అయిన తర్వాత తమకు, కార్యకర్తలకు బాధలు మరింత పెరిగాయని పేర్కొన్నారు. ఆమె ఎమ్మెల్సీ మాటకే కట్టుబడుతూ తమల్ని ఎంత మాత్రం పరిగణలోకి తీసుకోలేదన్నారు. 2024లో నిర్వహించబోయే ఎన్నికల ఎమ్మెల్యే అభ్యర్థిగా నిర్ణయించారని ప్రకటించుకుని వారి అనుచరుల ద్వారా నియోజకవర్గంలో బాణాసంచా కాల్చడం, కేకులను కట్ చేసుకుని స్వీట్స్ పంచి పెట్టుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి పార్టీ ఏమైనా పర్వాలేదు.. ఓడిపోయినా తన పంతం నెగ్గాలనే భావన కనిపిస్తుంది తప్ప అందరిని కలుపుకోవాలని ఆలోచన ఎంత మాత్రం ఉన్నట్టు కానరావడం లేదని ఆరోపించారు. గెలిస్తే ఒకటి మేలు.. ఓడితే రెండు మేలు అనే రీతిలో ఉన్నారని పేర్కొన్నారు. అందరినీ కలుపుకొని పోయి పార్టీని గెలిపించాలని స్పృహ ఏమాత్రం లేదన్నారు. ఒకవేళ మరోసారి ఎమ్మెల్యే టికెట్ సుధాకి ఇస్తే తాము పనిచేయలేమని చెప్పారు. ఆమోదయోగ్యమైన వ్యక్తిని ప్రకటించకపోతే కార్యకర్తల ఆలోచన మేరకు తమ భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల అధ్యక్షులు, జడ్‌పిటిసిలు, మాజీ మండల అధ్యక్షులు, మాజీ జడ్‌పిటిసిలు, మండల స్థాయి నాయకులు, 24 మంది సర్పంచులు, 20 మంది ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించడం పెద్దిరెడ్డికి తగదు : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును విమర్శించే హక్కు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఎంత మాత్రం లేదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్‌రాయుడు అన్నారు. సోమవారం రాజంపేట పట్టణంలోని బత్యాల భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దిరెడ్డి గురించి తనకు విద్యార్థి దశ నుంచే బాగా తెలుసునని చెప్పారు. 1978లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన పెద్దిరెడ్డి ఒక మైనార్టీ నాయకుడి చేతిలో చిత్తుగా ఓడిపోయారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు ఆయన విద్యార్థి దశ నుంచే నాయకుడిగా విజయాలు సాధిస్తూ వచ్చారని తెలిపారు. అటువంటి తమ నాయకుడుపై పెద్దపెద్ద ఆరోపణలు చేస్తూ ప్రగల్బాలు పలకడం ఆయనకు ఎంత మాత్రం తగదని విమర్శించారు. ఇసుక, మైనింగ్ మాఫియాలను నిర్వహిస్తూ ప్రజాధనాన్ని కొల్లగొడుతూ పోలీసులను అడ్డబెట్టుకొని టిడిపి నాయకులపై కేసులు బనాయిస్తూ సిగ్గులేని పాలన చేస్తున్నారని విమర్శించారు. దళితులను, మైనార్టీలను విస్మరించి ఎదురు తిరిగిన వారిపై కేసులు బనాయిస్తూ అనేక రకాలుగా వారిని ఇబ్బందులకు గురి చేస్తూ రాజకీయాలు కొనసాగిస్తున్నావని వైసీపీ పార్టీ సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఇచ్చిన ప్రకటనతోనే బండారం అంతా తేటతెల్లమైందని ఆరోపించారు. బెంగళూరులో లక్ష టిప్పర్ల ఇసుకను డంపింగ్ చేసుకొని కోట్ల రూపాయల దండుకుంటున్నావని ఆరోపించారు. తిరుపతిలో టిటిడి వారి కన్నా ఎక్కువగా కల్యాణ మండపాలు నిర్మించుకొని ఒక్కొక్క కల్యాణ మండపానికి అత్యధిక రేట్లు లక్షల్లో వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్టీ రామారావుకు నాదెండ్ల భాస్కరరావు ఎలా వెన్నుపోటు పొడిచాడో అదేవిధంగా పెద్దిరెడ్డి కూడా జగన్‌కు వెన్నుపోటు పొడిచేందుకు రంగం సిద్ధం చేసుకున్నారన్నారు. జగన్మో హన్‌రెడ్డిని ఎప్పుడెప్పుడు జైలుకు పంపిస్తామని పథకాలు రచిస్తున్నాడని త్వరలోనే ఆయనకు సొంత పార్టీ నాయకులే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడుపై ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల

డ్రైవర్లకు కంటిచూపు చాలా కీలకం : ఎంవిఐ


కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్నఎంవిఐ శివలింగయ్య

ప్రజాశక్తి-మదనపల్లి

డ్రైవర్లకు కంటిచూపు చాలా కీలకమని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శివలింగయ్య అన్నారు.రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని ఆటో, బస్సు, లారీ, క్యాబ్ డ్రైవర్ లను ఆయన కోరారు. ఏపీ ప్రభుత్వం రవాణా శాఖ ఆదేశాల మేరకు 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్టీవో కార్యాలయంలో డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు జనవరి 20 నుండి 19 ఫిబ్రవరి వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు . ఈ సందరేగాఆయన మాట్లాడుతూ గత 35 ఏళ్లగా జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు జరుపుకుంటున్నామని అయినా ప్రజల్లో మార్పు రాలేదని మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. టూ వీలర్ నడిపే వారు తప్పనిసరి హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. టూ వీలర్ వాహనాల్లో ఇద్దరని మించి డ్రైవింగ్ చేయరాదని ప్రాణం చాలా విలువైనది అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని నెమ్మదిగా డ్రైవింగ్ చేయాలని ఆయన కోరారు. ప్రాణం చాలా విలువైనది. ప్రమాదం వల్ల కుటుంబంలో ఒకరు దూరమైన కుటుంబమంతా రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వాహనాలను నడపాలని ఆయన సూచించారు. హెల్మెట్ లేకుండా మోటార్ సైకిల్ నడపనని, సెల్ ఫోన్లో మాట్లాడుతూ వాహనం నడపనని, మద్యం సేవించి వాహనం నడపనని, కారులో వెళ్ళినప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకుంటానని, రహదారి నియమాలను తప్పకుండా పాటిస్తానని, రోడ్డు ప్రమాద రహిత అన్నమయ్య జిల్లాగా, రోడ్డు ప్రమాద రహిత ఆంధ్ర రాష్ట్రంగా దిద్దడానికి రవాణా శాఖ వారికి నా వంతు సహకారాన్ని అందిస్తానని డ్రైవర్ల చేతప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఆర్టీవో కార్యాలయ సిబ్బంది, లారీ, ఆటో, క్యాబ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయులు మృతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఎంటిఎం స్కూల్ ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం ఆచారి (59) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పురుషోత్తం ఆచారి మదనపల్లి స్వగృహంలో ఉండి ఉదయం పాఠశాలకు బయలుదేరుతున్న సమయంలో గుండెపోటు వచ్చి కుప్పకూలాడు. అప్పటికే ఆయన మృతి చెందిన సమాచారం తంబళ్లపల్లెకు చేరింది. సమాచారం అందుకున్న ఎంఇఒలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు, పాఠశాల టీచర్లు మదనపల్లికు వెళ్లి హెచ్ఎం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఉద్యానవనంలో మొక్కలు దగ్ధం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి మండలం కొటాల పంచాయతీ జుంజురపెంట వద్దగల పెద్దేరు ప్రాజెక్టు ఉద్యానవనంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టటంతో విలువైన మొక్కలతో పాటు, మొక్కలకు నీటి సరఫరా కోసం వేసిన డ్రిప్పు పైపులు అగ్నికి ఆహుతీ అయిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. సుమారు రెండు సంవత్సరాల క్రితం ఉపాధి హామీ నిధులతో సందర్శకులకు వినోదం అందించడానికి ప్రాజెక్టు వద్ద ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఉద్యనవనంలో నిప్పుపెట్టడంతో పలు రకాల మొక్కలు అగ్నికి దగ్ధం అయ్యాయి. ఆదివారం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లిన గ్రామస్తులు అగ్నికి అహుతైన విలువైన మొక్కలను చూసి విచారం వ్యక్తం చేశారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ప్రశాంత్ నియామకం

ప్రజాశక్తి-పీలేరు


పీలేరుకు చెందిన ఎస్సీ మాదిగ విద్యార్థి ప్రశాంత్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. సోమవారం అతని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు పీలేరు మండలం, ముడుపుల వేముల గ్రామం, విద్యానగర్ మాదిగ పల్లికి చెందిన పల్లెపాగు ప్రశాంత్ ఉమ్మడి చిత్తూరు జిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ సీనియర్ ఏపీపీగా విధులు నిర్వహించి రిటైరైన శ్రీనాథ్ కుమారుడు. ప్రశాంత్ హైదరాబాదు ఉస్మానియా విశ్వ విద్యాలయంలో మాస్టర్ ఆఫ్ లా చేసి 2017లో తిరుపతిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల్లోనూ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారి వివరాలు రాష్ట్ర హైకోర్టు విడుదల చేసింది. ఆ జాబితాలో ప్రశాంత్ కూడా ఉన్నారు. ఈ సందరేగా జడ్జిగా ఎంపికై ప్రశాంత్ కు ఎంఆర్ పిఎస్ నాయకులు, ఎంఎస్ పి పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్ అభినందనలు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌పై 'ఆంధ్ర' ఘనవిజయం

ప్రజాశక్తి - కడప

సి కె నాయుడు ట్రోఫీలో భాగంగా కడపలోని రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ జట్టుపై 9 వికెట్ల తేడాతో ఆంధ్ర జట్టు ఘన విజయం సాధించింది. ఆంధ్ర బౌలర్లు టి. విజయ్, వై. వాసు బౌలింగ్‌లో విజృంభించి జట్టు గెలుపు కోసం దోహదపడ్డారు. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో ఛత్తీస్‌గఢ్ జట్టు 152 పరుగులు చేసింది. 5 వికెట్ల నష్టానికి 199 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 55.3 ఓవర్లలో 239 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆంధ్ర జట్టులోని ధరణి కుమార్ నాయుడు 88, వై. వాసు 52 పరుగులు చేశారు.ఛత్తీస్‌గఢ్ జట్టులోని దీపక్ యాదవ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 7 వికెట్లు తీసుకున్నాడు. 19 ఓవర్లు బౌలింగ్ వేసి అందులో 3 ఓవర్లు మేడిన్ వేసి 77 పరుగులు ఇచ్చి 7 వికెట్లు తీసుకున్నాడు. వరుణ్ సింగ్ 3 వికెట్లు తీసుకున్నాడు. దీంతో ఆంధ్ర జట్టు ఛత్తీస్‌గఢ్ జట్టుకు ఫాలో ఆన్ ఇచ్చింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఛత్తీస్‌గఢ్ జట్టు 23.0 ఓవర్లలో 99 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని ఆయుష్ పాండే 26 పరుగులు చేశాడు. ఆంధ్ర జట్టుకు చెందిన వై. వాసు అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. 10.0 ఓవర్లు బౌలింగ్ వేసి అందులో ఒక ఓవర్ మేడిన్ వేసి 43 పరుగులు ఇచ్చి వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ టి. విజయ్ 11.0 ఓవర్లు బౌలింగ్ వేసి అందులో ఒక ఓవర్ మీటింగ్ వేసి 46 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. దీంతో 13 పరుగుల విజయ లక్ష్యాన్ని చత్తీస్గడ్ జట్టు ఆంధ్ర జట్టు ముందు ఉంచింది. 13 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్కు దిగిన ఆంధ్ర జట్టు 2.2 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 13 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగు రోజులపాటు జరగాల్సిన ఈ మ్యాచ్ ఒకటిన్నర రోజుకే ముగియడం విశేషం.


తలపడుతున్న ఛత్తీస్‌గఢ్, ఆంధ్ర జట్లు


నిర్మాణంలో ఉన్న నీటి ట్యాంకు

చురుగ్గా ట్యాంకు నిర్మాణ పనులు

ప్రజాశక్తి-గాలివీడు

గేటు వద్ద లక్ష వేల లీటర్ల సామర్థ్యంతో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఒహెచ్ఎల్ ట్యాంకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి జె. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఆవుల శెట్టి వారి పల్లెకు 60 వేల లీటర్ల సామర్థ్యం కల్గిన ఒక ట్యాంకును, చెక్క వారిపల్లికి 40 వేల లీట్లసామర్థ్యం గల ట్యాంకును నిర్మిస్తున్నామని ఆయన చెప్పారు. మార్చి లోపల పూర్తయి ప్రతి ఇంటికి కుళాయి నీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే వెలిగల్లు ప్రాజెక్టు నుంచి గాలివీడు పట్టణానికి తాగునీరు అందిస్తున్నామని, రాబోయే రోజుల్లో గ్రామంలోని ప్రతి కుటుంబానికీ కుళాయి కనెక్షన్ ద్వారా నీరు అఒందిస్తామని చెప్పారు. ప్రతి ఇంటికి కూడా కులాయి కనెక్షన్ ద్వారా నీరు అందివ్వానున్నట్లు పేర్కొన్నారు


బహుమతులు అంటుకుంటున్న రామకృష్ణ గౌడ్

కార్యకర్తలకు పార్టీ సింబల్ బహుమతి

ప్రజాశక్తి-రామాపురం

జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు చేపట్టిన యువ గళం పాదయాత్రలో రాయచోటి నియోజకవర్గం సోషల్ మీడియా కార్యకర్తలు చురుగ్గా పార్టీకి పనిచేసినందుకు గుర్తింపుగా రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి చేతులు మీదుగా పార్టీ సైకిల్ గుర్తు బహుమతిగా అందించారని రామాపురం మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి చింతపించల రామకృష్ణ గౌడు, మండల తెలుగు యువత అధ్యక్షులు నాగభూషణ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ ఆర్ రమేష్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి సోషల్ మీడియాలో చురుగ్గా పాల్గొన్న 20 మందికి బహుమతులు అందజేశారన్నారు. టిడిపి సింబల్ అందుకున్న వారిలో రామాపురం మండలానికి సంబంధించి సి.రామకృష్ణ గౌడ్, వి.నాగభూషణ్ రెడ్డి. ఎం.గణేష్. చెన్నూరు బాబు. కిరణ్ నాయుడు ఉన్నారు.

'వెలుగు'లో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లి

వెలుగు ప్రత్యేక పాఠశాల వృద్ధాశ్రమంలోని ఒంటరి వయో వృద్ధ మహిళలకు ఉచిత వైద్య సేవలు, సలహాలు సూచనలను డాక్టర్ రామిరెడ్డి సోమవారం అందించినట్లు సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సొసైటీ కాలనీలోని సహస్ర ఆర్థోపెడిక్ హాస్పిటల్ డాక్టర్ జి.రామిరెడ్డి, ఫిజియోథెరఫీస్టు అశోక్ పాల్గొని మోకాళ్ళ నొప్పులతో బాధపడుతున్న వృద్ధులకు ఉచితంగా ఇంజెక్షన్లు వేశారన్నారు. ఎముకల దృఢత్వానికి కాల్షియమ్ మాత్రలను, నొప్పులతో బాధపడుతున్న వారికి నొప్పుల మాత్రలను, ప్రతి వృద్ధమహిళలకి బలాన్నిచ్చే మల్టీ విటమిన్ మాత్రలను డాక్టర్ రామిరెడ్డి ఉచితంగా అందజేశారన్నారు. అనంతరం ఫిషియోథెరపీ అవసరమున్న వృద్ధులకు ఫిజియోథెరపిస్ట్ అశోక్ కొన్ని వ్యాయామాలను చేయించారని తెలిపారు. కార్యక్రమంలో ఓటి టెక్నీషియన్ శంకర్ వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, సోషల్ వర్కర్ గీత, వృద్ధులు, పిల్లలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు

ప్రాజెక్టుల పూర్తిలో ప్రభుత్వ నిర్లక్ష్యం : 'కస్తూరి'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రంలో గత నాలుగున్నర సంవత్సరాల వైసిపి పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డి ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కస్తూరి వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ పాలనపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే దిగిపోవడానికి ఎంత మాత్రం ఆలోచించని జగన్ రెడ్డి ఒకటే గుర్తుపెట్టుకోవాలి జగన్ రెడ్డి ఓడిపోతారని భయంతో దిగిపోతా అనడం లేదన్నారు. అస్తవ్యస్తమైన, దిక్కుమాలిన పాలనపై ప్రజల్లో వస్తున్న తీవ్ర తిరుగుబాటును గుర్తించి తప్పుకుంటున్నాడని తెలిపారు. దిగిపోయిన సంతోషమే అని అనడం వెనుక భారీ కారణం ఉందన్నారు. ఐదేళ్లుగా ప్రజల్ని ప్రజా వనరుల్ని దోచేసుకుంటున్న జగన్ రెడ్డి ఆ డబ్బు మొత్తాన్ని సర్దుకోవడానికి ఎక్కడికక్కడ సెటిల్ చేసుకోవడానికి అని ప్రజలందరికీ తెలుసని అన్నారు. మరోవైపు ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రూ.10 లక్షల కోట్ల పైగా జగన్ అప్పు చేశారన్నారు. రోజురోజుకీ అప్పు పుట్టకుంటే పూట గడవని దీనస్థితిలో రాష్ట్రాన్ని జగన్ పడేశారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెట్టుబడిదారుల్ని వివిధ రకాలుగా ఇబ్బందులు పెట్టి తరిమేశారని తెలిపారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని జగన్ వైసిపి నేతలు చెబుతుంటే మరోవైపు ప్రజలు కూడా వారిని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. జగన్ అహంకారానికి వైసిపి అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు రాష్ట్ర ప్రజలు కంకణం కట్టుకున్నారన్నారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కమతం నాగరాజు మండల పార్టీ అధ్యక్షులు కొమ్మ శివ రమేష్ బాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో కన్యమడుగు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కన్నెమడుగు పంచాయతీ అన్ని విధాల అభివృద్ధి పనుల్లో నడుస్తుందని సర్పంచ్ శ్యామలమ్మ, ఎంపిటిసి సభ్యులు మహేష్ పేర్కొన్నారు. సోమవారం వారు తాగునీటి బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఇందుకు పూర్తి సహకారం అందించడంతో అభివృద్ధిలో మొదటి స్థానం నిలిపారన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎక్కడ తాగు నీటి సమస్య ఉండకూడదన్న సూచనలతో జలజీవన్ మిషన్ నిధులు రూ.26 లక్షలతో నూతన బోర్లు వేసి మోటార్లు ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీలో ఎక్కడ తాగునీటి సమస్య అన్నదే లేకుండా పోవడంతో ప్రజలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.


బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్యామలమ్మ